# యస్.ఆర్.స్వామి

# 'మార్పు'

"రండమ్మా రండి. కారు రెడీగా ఉంది". సన్మాన సభ ముగిసి బయటకు రాగానే ఆహ్వానించాడు విదేశ మద్య వర్తకుల సమాఖ్య అధ్యక్షుడు.

మీరేమీ మొహమాట పడకండి" సందేహిస్తూ నించున్న నన్ను ఉద్దేశించి అన్నాడు అతడు." ఈ కారు మీదే అనుకోండమ్మా. మీ దయ ఉంటేనే గదా మేము పచ్చగా ఉండేది"

కారు ఎక్కుతుంటే నాకు నవ్వు వచ్చింది. ఆరు నెలల్లో ఎంత మార్పు వచ్చింది! ఆరునెలల క్రితం నన్ను 'మీరు' అని సంబోధించిన వాళ్ళని నేనెరగను. అప్పట్లో నన్నెరిగిన వాళ్ళే తక్కువ! కానీ ఇప్పుడు...

ఊరంతా నన్నెరుగుదురు.

సారా వ్యతిరేక ఉద్యమానికి ఊపిరి పోశానని కొనియాడు తున్నారు.

ఎంతపని చేసింది ఈ సారా!

నాకు నవ్వాలనిపించింది.

ఎనిమిది నెలల క్రితం మేనమామని మను వాడి, పట్నానికి కొంత దూరంలో ఉన్న పల్లెకి కాపురానికి వచ్చాను. అందరి ఆడపిల్లల లాగే, గుట్టుగా, సంసారం చేసుకోవాలనే అనుకున్నాను. కానీ...

రోజంతా కష్టపడి సంపాదించిన డబ్బు, భర్త చేతిలో సారాగా మారిపోతూ ఉంటే...

మొదట్లో సానుభూతిగా చూశాను.

తరువాత అనునయంగా, ఆ అలవాటు మానమని అర్థించాను.


కానీ లాభం లేక పోయింది.

నాకు నా మీదే కోపం వచ్చింది. ఆలోచనా శక్తి కోల్పోయాను. పట్టరాని కోపంతో పిచ్చెక్కిన నేను ఊరి చివరనున్న సారా దుకాణానికి వెళ్ళాను. సారా పేకట్లు చించి పారేశాను.

సారా తాగే భర్తల బాధ భరించలేని ఆడవారు నాకు అండగా నిలిచారు గానీ మా మామ మాత్రం ఊరు కోలేదు.

"నువ్వు ఏమైనా నాయకురాలివై పోదామనుకుంటున్నావా?" జుట్టు పట్టుకొని ఈడ్చి నేలమీదకు తోసి అరిచేడతను" నోరుమూసుకొని పడిఉండు. నిన్ను నరికి పోగులు పెట్టటం నాకేం కష్టం కాదు. కానీ, మా అప్పమొహం చూచి ఊరు కుంటు న్నాను."

నేను ఊరు కోలేదు. సారా వ్యతిరేక ఉద్యమం సాగించాను. ఇప్పుడు మా ఊరిలో




సారా దుకాణాలు లేవు. మా ఊరిలోనే కాదు, చుట్టు పక్కల గ్రామాల్లో కూడా లేవు. సారా దుకాణాల ఎత్తివేతకు నేనే కారణమని పొగుడుతున్నారు సన్నాహాలు చేస్తున్నారు.

ఎంత ఘనంగా సన్మానించారు ఈ రోజు. ఎంత మంది జనం! ఎన్ని శాలువాలు కప్పారు!

నా కళ్ళు చెమర్చాయి. మామ వస్తే బావుండేది. చూసి ఆనందించేవాడేమో!

కారు మా వీధి చేరుకుంది. తృతీయ చంద్రుడు వెదజల్లిన వెన్నెల బిందువులు మా వీధిలో ఉట్టి పడుతుంది. వీధి ప్రశాంతంగా ఉంది.

ఆరునెలల క్రితం ఈ సమయంలో మా వీధి ఇలా ఉండేది కాదు. త్రాగిన వారి అర్థ రహితమైన మాటలతో, ఆడవారి కేకలతో కోలాహలంగా ఉండేది. త్రాగిన మైకంలో ఉన్నవారు విసరేసిన అన్నం గిన్నెలోంచి జారిపడిన మెతుకులు అక్కడక్కడ పడి ఉన్న మా వీధి, అక్కడక్కడ చుక్కలు విరిసిన అమావాస్య నాటి ఆకాశంలా ఉండేది.

ఇంటిదగ్గర ఆగింది కారు.

తలుపు వేసి ఉంది. మామ ఇంకా ఇల్లు చేరలేదన్నమాట.

తలుపు తీసిలోని కెళ్ళాను. బాగా బడలికగా ఉంది. అలసిపోయిన కళ్ళు మూతలు పడు తున్నాయి.

నవ్వారు మంచంమీద కూలబడ్డాను.

పట్టీ పట్టని నిద్రలో ఎవరో తాగి మాట్లాడుతున్నట్లనిపించింది. కల ఏమోనని అనుకున్నాను. కానీ మాటలు మరీ, మరీ దగ్గరగా వినిపిస్తున్నాయి.

"ఏమే ఊరిలో సారా పేకట్లు చించి పారేస్తే మేము త్రాగము అని అనుకున్నావా! పిచ్చిదానా ఊర్లో బోర్లు ఉన్నాయే."

తుళ్ళిపడి లేచాను. కళ్ళు నలుపుకొని చూశాను. ఎదురుగా తూలుతూ నిలబడ్డాడు మామ!

చేతిలో బ్రాందీ సీసా!

నాలుగు రూపాయల వ్యసనం నలబది రూపాయలకు పెరిగిందన్నమాట!

ఖంగు తిన్నాను.

సారా పేకట్లు చింపివేస్తే, జనాల్లో మార్పు వస్తుందని పొరబడ్డాను. ఊరిలో రమ్ము, విస్కీలు ఉన్నాయన్నది మర్చిపోయాను. అయినా రావాల్సిన మార్పు మనిషిలోనూ, మనసులోనూ కదా?

బాధగా లేచి వీధివైపు నడిచాను. తలుపు వెయ్యాలని. వీధి చీకటిగా ఉంది. అంతవరకు వెన్నెల పరచిన చంద్రుడు అస్తమించాడు. అతడు తృతీయ చంద్రుడేనని, పున్నమి ఇంకా ఎంతో దూరములో ఉందని తెలిసి నిట్టూర్చాను.



పల్లకి వినూత్న వారపత్రిక 29-12-93